ఘనంగా మట్టల ఆదివారం



గోకుల్ నగర్ ఎస్పీజీ-2 చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పాల్గొన్న క్రైస్తవులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక గోకుల్ నగర్‌లోని ఎస్పీజీ-2 చర్చిలో మట్టల ఆదివారం వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ కోలాటి రాజు మాట్లాడుతూ క్రీస్తు చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. మానవాళి పాపాలను తొలగించేందుకు క్రీస్తు తన రక్తం చిందించారని తెలిపారు. అనంతరం పుర వీధుల్లో క్రైస్తవులు ఈత మట్టలను పట్టుకుని క్రీస్తు గీతాలు ఆలపిస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రామేశ్వరం సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం వేడుక నిర్వహించారు. క్రైస్తవులు ఈత మట్టలను పట్టుకుని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎం.జాకోబ్ ఫ్రాంక్ దేవుని వాక్యాన్ని వినిపించారు. ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించి క్రీస్తును స్తుతిస్తూ పాటలు పాడారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు పాల్గొన్నారు. అలాగే ఎస్పీజీ-1. ఎస్పీజీ-3, గోల్డెన్ జూబ్లీ తదితర చర్చిలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

మైదుకూరులో...

మైదుకూరు: పట్టణంలోని శాంతి నగర్ సీఎస్ఐ చర్చి, మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాపురం చర్చి పాస్టర్ అర్నీష్ బాబు మట్టల పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం సంఘ సభ్యులు మట్టలను చేతబట్టి గుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. శాంతినగర్ సీఎస్ఐ చర్చిలో పాస్టర్ వినయ్ కుమార్ దైవ సందేశాన్ని వినిపించారు. సంఘ పెద్దలు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలసపాడు: స్థానిక పరిపేతురు పరిపౌలు(సీఎస్ఐ), ఆర్సీఎం చర్చిలలో ఆదివారం మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు రెవ ఆశిష్ గాబ్రియేల్ మాట్లాడుతూ యేసు రాజులకు రాజుగా, సమాధానకర్త అయిన దేవుడుగా వచ్చి ఉన్నాడని భక్తులకు దైవ సందేశం అందించారు. అందరూ శాంతి, సమాధానం కలిగి యేసు మార్గంలో జీవించాలన్నారు. అనంతరం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత గురువులు, భక్తులు ఈతమట్టలు పట్టుకుని చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

బద్వేలు అర్బన్: మట్టల ఆదివారం సందర్భంగా పట్టణంలోని పునీత ఆంతోనీ చర్చి విశ్వాసులు స్థానిక గుప్తా నగర్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా సురేంద్ర నగర్ వరకు మట్టలు చేతపట్టి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు రెవ. ఫాదర్ లక్కినేని ఆరోగ్యరాజు మాట్లాడుతూ లోక రక్షకుడైన యేసు ప్రభువు సర్వలోక పాప పరిహారానికై యెరుసలేంలో ప్రవేశించిన దినంగా మట్టల పండగ జరుపుకొంటారని వివరించారు. క్రైస్తవులు భక్తి గీతాలు, దేవుని స్తోత్రాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

● స్థానిక సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారం సందర్భంగా ప్రత్యేక ఆరాధన పూజలు నిర్వహించారు. చర్చి డీనరీ చైర్మన్ రెవ.ఎం.ఎఫ్.ఎస్.ఆనంద్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే ఫాతిమా మాత చర్చిలో విచారణ గురువులు రెవ. ఫాదర్ గొడుగునూరు విజయరావు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి పెస్బిటర్ స్వరాజ్‌జీవన్‌బాబు, చర్చి సెక్రటరీ జి.కె.ఎడ్వర్డ్, ట్రెజరర్ ఎం.సునీల్‌కుమార్, యూత్ కౌన్సిల్ మెంబర్ జ్యోతి, స్త్రీల విభాగం ప్రెసిడెంట్ సరలసలోమి ఆనంద్, సెక్రటరీ జానకమ్మ, సభ్యులు దేవానందం, సుజాత పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



గంగమ్మ దేవాలయం వద్ద ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు: దువ్వూరులో జరుగుతున్న గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొన్నారు. గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖ శాంతులతో ఆనందంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ నడిపి ఓబయ్య, చిరాకి బాషా, బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి, సంగన హరినాథరెడ్డి, గోపిరెడ్డి ఓబుళరెడ్డి, తుమ్మల మస్తాన్ రెడ్డి, పుల్లగూర రామకృష్ణయ్య, వీరమోహన్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

28న బండలాగుడు పోటీలు

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో మాధవరాయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా న్యూ కేటగిరి వృషభరాజులకు బండలాగుడు పోటీలు ఈనెల 28న నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50,000 ఉంటాయన్నారు. వివరాలకు 9948295014, 8500321208 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

వైభవంగా కోట పోలేరమ్మ తిరునాల



కోటపోలేరమ్మ ఆలయం వద్ద కుంకుమబండి

పోరుమామిళ్ల: పట్టణంలోని రంపాడురోడ్డులో వెలసిన కోట పోలేరమ్మ తిరుణాల మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. ముగింపు రోజున ఆదివారం బలిజ కోట నుంచి అమ్మవారి పుట్టింటి వారు కుంకుమబండి కట్టి ఊరేగింపుగా రంపాడురోడ్డులోని కోట పోలేరమ్మ దేవస్థానానికి వచ్చారు. భక్తులు కోళ్లు, మేకపోతులు తీసుకుని మేళతాళాల మధ్య రంగులు చల్లుకుంటూ వచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలతో వచ్చి నైవేద్యం సమర్పించారు. ఆదివారం ఉదయం నుంచే వేలాదిమంది భక్తులతో ఆలయం కిటకిట లాడింది. కొందరు తలనీలాలు సమర్పించుకున్నారు.

నేడు చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. వేకువ జామున స్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ఆరు గంటలకు లోక కళ్యాణార్థం గణపతి, నవగ్రహ, చండీ హోమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



భూమాయపల్లెలో ఓటుపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మైదుకూరు: ఓటుతోనే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించవచ్చునని వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సొహెల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని భూమాయపల్లెలో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా సమాజ సేవ అంశంపై శిబిరం నిర్వహిస్తున్నారు. చివరి రోజున ఆదివారం ఓటుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ చైతన్యవంతమైన ప్రజాస్వామ్యానికి ఓటు అత్యంత విలువైందన్నారు. ఎన్ఎస్ఎస్ చదువులో ఒక భాగమన్నారు. అనంతరం 50 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అధ్యాపకులు రాధా రామ్, శివశంకర్, సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు పట్టణంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. స్థానిక త్యాగరాజ వీధిలోని 20వ వార్డుకు చెందిన నాయీ బ్రాహ్మణులు బంగారంగళ్లు, దర్గా బజార్ మీదుగా బ్యాండ్ మేళా, బాణసంచా పేల్చుతూ బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గంగమ్మకు నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కె.కిశోర్ కుమార్, వార్డు కౌన్సిలర్ నాగేంద్రారెడ్డి, రాజేంద్ర బాబు, సుదర్శన్, ప్రభాకర్, లక్ష్మన్న, ప్రసాద్, శోభన్‌బాబు, కిరణ్‌కుమార్, క్రాంతికుమార్, కళ్యాణ్‌కుమార్, ఎస్.శ్రీనివాసులు, సురేష్, వీరయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో హోలీ సంబరాలు



శ్రీరాంనగర్‌లో హోలీ సందర్భంగా ఆనందహేళి

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీరాం నగర్‌లో ఆదివారం సాయంత్రం మహిళలు, పిల్లలు హోలీ సంబరాలు జరుపుకొన్నారు. ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ, హోలీ హోలీరే అంటూ నినాదాలు చేశారు. మహిళలు నృత్యాలు చేస్తూ ఆనందంగా పాల్గొన్నారు.

నేడు కేశాపురంలో ఎన్నికల ప్రచారం

బ్రహ్మంగారిమఠం: మండలంలోని ముడుమాల పంచాయతీ కేశాపురంలో సోమవారం మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే శెట్టిపల్లెపల్లె రఘురామిరెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సంప్రదాయం ప్రకారం మండలంలోని కేశాపురం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారని, నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు , కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రచారంలో పద్మశాలీయ సంఘం నాయకులతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టం కడతారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఇంటింటా తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ విష ప్రచారంతో నెగ్గాలని ప్రయత్నిస్తోందన్నారు. జగనన్న సంక్షేమ పథకాలతోపాటు నియోజకవర్గ అభివృద్ధితోని చూసిన ప్రజలు మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తారన్నారు. గతంలో ఎన్నడూ చేయలేని అభివృద్ధిని జగనన్న హయాంలో చేసి చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, కౌన్సిలర్లు అరుణ, గుర్రం లావణ్య, గరిశపాటి లక్ష్మీదేవి, పిట్టా బాలాజీ, కోనేటి సునంద, మోపూరి ప్రశాంతి, పల్లేటి శంకర్‌రెడ్డి, గజ్జల కళావతి, బలిమిడి చిన్నరాజు, బాలకృష్ణ, ఊటుకూరు కుటుంబీకులు, పద్మశాలీ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జై భారత్ నేషనల్ పార్టీ కో ఆర్డినేటర్ నియామకం



జేడీ లక్ష్మీనారాయణ నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఎల్.శ్రీనివాసులరెడ్డి

బ్రహ్మంగారిమఠం: జై భారత్ నేషనల్ పార్టీ మైదుకూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా బి.మఠం మండలం గంగిరెడ్డిపల్లెని వాసి లెక్కల శ్రీనివాసులరెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు జెడీ లక్ష్మీనారాయణ నియామక పత్రం అందజేశారు. రాబోయే ఎన్నికల్లో మైదుకూరు నియోజకవర్గం నుంచి జై భారత్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలవాలని నిర్ణయించుకున్నట్లు ఎల్.శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

కార్యకర్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్ రెడ్డి

రాజుపాళెం: ప్రొద్దుటూరులో బుధవారం నిర్వహించే సీఎం జగన్ బస్సు యాత్రను విజయవంతం చేద్దామని టంగుటూరు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతమ్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని టంగుటూరు సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి ఇంటిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం గౌతమ్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించారన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీగా వైఎస్.అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రాదరెడ్డిని మళ్లీ భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. బస్సు యాత్రకు పోయేందుకు బస్సులను ఏర్పాటు చేశారని, పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోనా రఘురామిరెడ్డి, ధనిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఇమ్మారెడ్డి నరసింహారెడ్డి, మహేశ్వరరెడ్డి, నవనీధర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం: ఈ నెల 27న ప్రొద్దుటూరులో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తున్నారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. బి.మఠం మండల జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్‌లతో కలిసి ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బి.మఠం మండలం నుంచి ప్రతి కార్యకర్త కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు పుణ్యకార్యం



ఇఫ్తార్‌లో దువా చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంఎల్‌సీ రమేష్‌యాదవ్

కమలాపురం : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించే ముస్లిం సోదరులకు ఉపవాసాలు విడిచే సమయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఎంఎల్‌సీ రమేష్ యాదవ్ తెలిపారు. ఆదివారం రాత్రి కమలాపురంలోని పెద్ద దర్గాలో వైఎస్సార్ సీపీ మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వారు హాజరయ్యారు. అంతకు ముందు దర్గా-ఏ-గఫారియా, జహీరియాలో స్వాముల వారి మజార్లపై పూల చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందుకు తాము రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే రాష్ట్రం అంతా చల్లగా ఉండాలంటే జగనన్న ప్రభుత్వం తిరిగి రావాలన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనంతా అవినీతి, కరువులతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించారన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇంటికే చేరుతున్నాయని ప్రజలంతా జగనన్న పాలన తిరిగి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు దస్తగిరి స్వామి, గౌస్‌పాక్, జియా, సర్ఫరాజ్, నాయకులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో క్షయ నివారణ



చాపాడులో క్షయ నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



ప్రొద్దుటూరు క్రైం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చాపాడు: సమష్టి కృషితో క్షయను నివారించవచ్చునని వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రాజేష్ కుమార్, శ్రీవాణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆదివారం ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రపంచంలోని చాలా ప్రాంతాలలో క్షయ వ్యాధి అంటు వ్యాధిగా మిగిలి పోయిందని, ఏటా దాదాపు ఒకటిన్నర మిలియన్ల మంది ఇతర దేశాలలో మరణిస్తున్నారన్నారు. డా.శ్రీవాణి మాట్లాడుతూ.. బెర్లిన్‌లో కోచ్ ప్రకటన సమయంలో టీబీ యూరప్, , అమెరికాలో విజృంభిస్తోందన్నారు. టీబీ సూపర్‌వైజర్ సురేష్ మాట్లాడుతూ..టీబీ ఊపిరి తిత్తులను ప్రభావితం చేయడమేగాక, వెన్నెముక, మెదడు, గర్భాశయం వంటి కీలక అవయవాలను ప్రభావితం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రాఘవయ్య, సుకన్య, సరస్వతి, బాబుల్‌రెడ్డి, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ర్యాలీ

బద్వేలు అర్బన్: క్షయ వ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని వైద్యాధికారులు డాక్టర్ జోత్స్న స్వర్ణలత, డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్షయ వ్యాధిపై జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి ప్రాణాంతక వ్యాధి కాదని, ప్రస్తుతం మెరుగైన వైద్య చికిత్స అందుబాటులో ఉందని పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులు నిర్దేశించిన సమయంలోగా చికిత్స తీసుకుంటే నయమవుతుందన్నారు. అనంతరం క్షయ వ్యాధి నివారణకు తమ వంతు చేయూతనిస్తామని వైద్యసిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ శ్రీనివాసులు, క్షయవ్యాధి నివారణ పర్యవేక్షకులు నరసింహప్రసాద్, సీహెచ్‌ఓ చంద్రావతి, వెంగయ్య, బ్రహ్మారెడ్డి, భారతి, లక్ష్మీదేవి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్షయకు ముగింపు పలుకుదాం

– జిల్లా ఆస్పత్రి సూరింటెండెంట్ ఆనంద్‌బాబు

ప్రొద్దుటూరు క్రైం: సమష్టి కృషితో క్షయ వ్యాధికి ముగింపు పలుకుదామని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా ఆస్పత్రి నుంచి సిబ్బందితో కలిసి ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో క్షయవ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఏటా మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం జరుపుకొంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ సూర్య నాగలక్ష్మి, డీపీఎంఓ శివశంకరయ్య, టీబీ యూనిట్ సూపర్ వైజర్లు రాజారత్నం, హుస్సేన్‌బాషా, గంగా శ్రీదేవి, గురుప్రసాద్ రెడ్డి, చందు, ఫౌజియా, ఆశా కార్యకర్తలు, సెర్ప్ ఎన్జీఓ పీసీ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాశినాయన: మండల కేంద్రమైన నరసాపురం మోడల్ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సౌజన్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి మే 22వ తేదీ వరకు ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 9010793182 నెంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పవన్ రెడ్డి

ప్రొద్దుటూరు: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన లక్కిరెడ్డి పవన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని ఆదివారం కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించారని పవన్ రెడ్డి పేర్కొన్నారు.

గరుడ వాహనంపై శ్రీనివాసుడు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్: మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహన సేవ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. తొలుత ఎమ్మెల్సీకి వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయంలో ఉదయం హంసవాహన సేవ జరిపారు. అనంతరం మోహినీదేవిగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, కె.రమణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, పోలిరెడ్డి, చిన్నపోలిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్.వి.సాయిక్రిష్ణ, శేఖర్‌రెడ్డి, కుప్పాలరమణ, క్రిష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భరద్వాజ్, మెంటా అశోక్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

ప్రొద్దుటూరు క్రైం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని త్రీటౌన్ సీఐ వెంకట రమణ తెలిపారు. రాజీవ్ సర్కిల్, ఎర్రన్న కొట్టాలు, భగత్‌సింగ్ కాలనీ, ఆచార్ల కాలనీ, మార్కెట్ ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు రాకుండా చేయడానికి, కేంద్ర పోలీసు సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సీఐ అబ్దుల్‌కరీం, సిబ్బంది పాల్గొన్నారు.

అంకాలమ్మకు పూజలు

బి.కోడూరు: మండలంలోని మున్నెల్లి సమీపాన సగిలేరు ఒడ్డున వెలసిన మహంకాళి (అంకాలమ్మ) అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండవరోజున ఆదివారం ధ్వజారోహణం పూజలు చేసి, అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు : స్థానిక పోలీసులు ఆదివారం రెండు వేర్వేరు ప్రదేశాల్లో పేకాట ఆడుతున్న జూదరులను అరెస్టు చేశారు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు జమ్మలమడుగు రహదారిలో చెరువుకు సమీపంలో పేకాట ఆడుతన్న 5 మంది జూదరులను అరెస్టు చేసి, రూ. 6,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.